క్లుప్తంగా

ఆలయానికి వితరణ



టేకు కలప వితరణ చేస్తున్న దాతలు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీ అంకమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ, శ్రీ మద్దిరావమ్మ అమ్మవార్ల దేవాలయ పునఃనిర్మాణానికి బాస మల్లికార్జున్, ధనలక్ష్మి దంపతులు ఆలయ మెయిన్ డోర్‌కు రూ.60 వేలు విలువ చేసే టేకు కర్రను శుక్రవారం ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమ్ముబాస్కర్, ప్రధాన కార్యదర్శి సూరంసెట్టి నరిసింహారావు, కోశాధికారి గుండోజు రామారావుచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు రామన్నపేటలో ఆధార్ క్యాంప్

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని రామన్నపేట బ్రాంచ్ పోస్టాఫీస్‌లో శనివారం ఆధార్ సేవల క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బీ.రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామన్నపేట పరిసర ప్రాంతాలు, గ్రామాల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాగా, శనివారం నాడు నగరంలోని జెడ్పీ కార్యాలయంలోని పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు నిలిపివేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని 11 కేవీ నెహ్రూనగర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నెహ్రూనగర్, నిజాంపేట, వైరారోడ్‌లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్–2 ఏఈ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నగరంలోని టేకులపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా నేడు ఉదయం 6.30గంటల నుంచి 9 గంటల వరకు చైతన్యనగర్, టేకులపల్లి, ఖానాపురం, టేకులపల్లి డబుల్‌బెడ్రూం, వైఎస్ఆర్‌నగర్, పారిశ్రామిక ప్రాంతం, వెలుగుమట్ల తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఖమ్మం అర్బన్ విద్యుత్ ఏఈ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

జయప్రదం చేయండి

ఖమ్మం సహకారనగర్: నగరంలో నిర్వహించనున్న బుక్ ఫెయిర్‌ను జయప్రదం చేయాలని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సభ్యుడు కవి సీతారాం, బుక్ ట్రస్ట్ కార్యదర్శి చంద్రమోహన్, గోపి, జీవన్‌కుమార్, శ్రీనివాసులు, లక్ష్మీకాంతమ్మ, పూర్ణచందర్‌రావు, గ్రంథాలయ నిర్వాహకులు కొండలరావు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటి రావాలి... కాంగ్రెస్ గెలవాలి

రఘునాథపాలెం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి చేరాలని, ఆ పార్టీ అధికారంలో రావాలని కోరుతూ రఘునాథపాలెం మండలం బద్యాతండాకు చెందిన నాయకుడు బానోత్ కోటేష్‌నాయక్ తిరుమలలో పూజలు చేశారు. కుటుంబసభ్యులతో కలిగి ఆయన కాలినడకన తిరుమల వెళ్లి స్వామిని దర్శించి పొంగులేటి కాంగ్రెస్‌లో చేరి ముఖ్యమంత్రి స్థాయికి ఎదగాలని ప్రార్థించినట్లు తెలిపాడు.

ఫోన్లు అప్పగింత

తిరుమలాయపాలెం: ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు తిరుమలాయపాలెం ఎస్ఐ వరాల శ్రీనివాస్ సీఈఐఆర్ అనే పోర్టల్ ద్వారా ఫోన్‌లను గుర్తించి అప్పగించారు. మండలంలోని సుబ్లేడు గ్రామానికి చెందిన మోత్కూరి వీరేశలింగం, బీరోలు గ్రామానికి చెందిన గుమ్మడి శ్యామ్ అనే వ్యక్తులు మొబైల్ ఫోన్ పోగొట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఐఎంఈఐ నంబర్ ద్వారా గుర్తించి ఫోన్‌ను గుర్తించి బాధితులకు అప్పగించారు.

దిష్టిబొమ్మ దహనం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకొని వెంటనే అరెస్ట్ చేయాలని పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో న్యూడెమోక్రసీ అనుబంధ ప్రజాసంఘాల ఆధ్వర్యాన బ్రిజ్‌భూషణ్ దిష్టిబొమ్మను దహనం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రెజ్లర్లకు న్యాయం చేయాలని, ఎంపీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు షేక్ సుభహాన్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పి.లక్ష్మక్క, నాయకులు మాదారపు ఉమాశంకర్, పాముల మోహన్‌రావు, మహంకాళి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధమైన తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ భవనం

మార్పు మంచికే!

అభివృద్ధి పథంలో రఘునాథపాలెం మండలం

- అర్బన్‌లో ఉన్నప్పుడు ఆమడదూరంలో..
- మండలం ఏర్పడ్డాక పంచాయతీల్లో సుపరిపాలన
- పట్టణాలను తలపించేలా గ్రామాల అభివృద్ధి

రఘునాథపాలెం: గత ఆరేళ్ల క్రితం ఖమ్మం అర్బన్‌లో అంతర్భాగంగా ఉన్న రఘునాథపాలెం, ప్రస్తుతం రఘునాథపాలెం మండలంలోని గ్రామాలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేవి. సకాలంలో నిధుల రాకపోవడం, అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షణ లేకపోవడంతో పనులన్నీ ఎక్కడికక్కడే ఆగిపోయి మారుమూల గ్రామాల కంటే అధ్వానంగా ఉండేవి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక కొత్త జిల్లాలు, కొత్త మండలాల విభజనలో భాగంగా ఖమ్మం జిల్లాలో రఘునాథపాలెంను మండలకేంద్రంగా ఏర్పాటు చేశారు. అనంతరం ప్రస్తుతం ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవతో మారుమూల పల్లెలు, గిరిజన గ్రామాలు సుపరిపాలనతో అభివృద్ధి చెందుతూ వస్తోంది.

అంచెలంచెలుగా అభివృద్ధి..

మండల అభివృద్ధికి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోటా నిధులలో పాటు విద్యుత్ శాఖ, సుడా తదితర విభాగాల నుంచి పెద్ద మొత్తంలో నిధులు తీసుకొచ్చి లింకు రోడ్లు, అంతర్గత రహదార్లు, వ్యవసాయానికి వెళ్లే డొంక రోడ్లు సైతం అభివృద్ధి చెందుతూ అంచెలంచెలుగా ఎదుగుతూ వస్తోంది. ఈ క్రమంలో గత నాలుగేళ్ల క్రితమే ఎంపీడీఓ కార్యాలయం నిర్మాణం పూర్తి చేసి మంత్రి కేటీఆర్‌చే ప్రారంభించారు. తాజాగా తహసీల్దార్, పోలీస్‌స్టేషన్ భవనాలను ఒక్కోటి రూ.50 లక్షలు చొప్పున నిర్మాణం పూర్తి చేసి శనివారం మంత్రులచే ప్రారంభించడానికి సిద్ధం చేశారు. మండలంలో రైతుల అవసరాలకనుగుణంగా ఆరు రైతు వేదికలు నిర్మించుకోగా.. అందులో రఘునాథపాలెంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తన సోదరుడు ఉదయ్‌కుమారు పేరుతో, వీవీపాలెంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తన సోదరుడు పేరుతో, రాంక్యాతండాలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మద్దినేని వెంకటరమణ తన తండ్రి పేరుతో సొంత నిధులతో నిర్మించినవి ఉన్నవి.

కొత్తగా 20 గ్రామపంచాయతీలు..

జిల్లాల పునర్ విభజనలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోనే రఘునాథపాలెం ఏకైక మండలంగా ఏర్పడడంతో మంత్రి పువ్వాడ అత్యధిక భాగం మండలంలోని గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్నారు. మండలంలో 20 పైగా కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసి అందులో 37 గ్రామ పంచాయతీల కల్గిన మండలంగా తయారు చేశారు. దీంతో గిరిజనులు, ప్రత్యేకంగా మహిళలు రాజకీయాల్లో రాణించేందుకు దోహదపడుతున్నాయి. అంతేకాక పల్లెప్రగతి కార్యక్రమాల ద్వారా పంచాయతీల్లో పల్లెపకృతి వనం, డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు మిషన్ భగరీథ పథకం ద్వారా ఇంటింటికి నల్లా నీరు అందించే పనులు పూర్తి చేయించి అభివృద్ధికి కేరాఫ్‌గా మారాయి.



పువ్వాడనగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం

పట్టణాలకు దీటుగా..

పట్టణాలను తలపించేలా మండలంలోని గ్రామాల అభివృద్ధి జరుగుతోంది. పలు గ్రామాల్లో డబుల్ బెడ్రూం ఇళ్లు, మంచుకొండ, జింకల తండా వద్ద గోదాంల నిర్మాణం, మేజర్ గ్రామ పంచాయతీలైన రఘునాథపాలెం, వీవీపాలెం, మంచుకొండ తదితర గ్రామాల్లో డబుల్ లైన్ల రోడ్లతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. తాజాగా సుడా నిధులుతో ప్రతీ పంచాయతీలో హైమాక్స్ లైట్లు వేయించే పనులు సాగుతున్నాయి. రాష్ట్రంలో ఏకైక పాఠశాలగా ఉన్న స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ పాఠశాలను సైతం రఘునాథపాలెం మండల కేంద్రంలో ప్రారంభించి రూ.20 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నారు. అలాగే రూ.2 కోట్లతో సుడా పార్కు నిర్మాణం చేయించారు. విద్యుత్ సమస్యలు తీర్చడానికి కొత్తగా సబ్ స్టేషన్లు నిర్మాణం తదితర పనులతో మండలంలో పాలన, అభివృద్ధి ప్రజలదరికి చేరిందనే చెప్పాలి.

దూరాభారం తగ్గింది..



ఖమ్మం అర్బన్ మండలంలో రఘునాథపాలెం ఉన్నప్పుడు ఏ పని కావాలన్నా దూరాభారం అయ్యేది. కానీ మండల కేంద్రంగా ఏర్పాటైన తర్వాత పాలన మరింత అందుబాటులోకి వచ్చింది. అధికారులను కలవడం, పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ పరంగా ఒకే కాంప్లెక్స్‌లో ఉండడంతో పనులన్నీ సులభంగా చేసుకోగలుగుతున్నారు.

– మాలోత్ ప్రియాంక, జెడ్పీటీసీ, రఘునాథపాలెం

గ్రామానికి మంచి గుర్తింపు..



రఘునాథపాలెం మండల కేంద్రంలో అన్ని రకాల కార్యాలయాలు రావడం ద్వారా గ్రామానికి మంచి గుర్తింపు వచ్చింది. గతంలో ఖమ్మంలో పలు దిక్కుల్లో ఉన్న కార్యాలయాల చుట్టూ పనుల కోసం పరుగులు తీయాల్సి వచ్చేది. కానీ, ఇప్పుడు అంతగా కష్టపడాల్సిన పనిలేదు.

– గుడిపుడి శారద, సర్పంచ్, రఘునాథపాలెం

దరి చేరిన పాలన..



మండల ఏర్పాటుతో ప్రజల వద్దకు పాలన వచ్చినట్లు అయింది. పలు ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండడంతో అధికారులు సైతం పనులను సహకాలంలో చేస్తే బాగుంటుంది. కార్యాలయాలన్నీ ఒకేచోట ఉండడంతో పనులు త్వరగా చేసుకునేలా వెసులుబాటు కలిగింది.

– వాంకుడోత్ విజయ, సర్పంచ్, మంచుకొండ

అవకాశాలు వచ్చాయి..



ప్రభుత్వ కార్యాలయాలతో పాటు చిన్న చిన్న గ్రామాలను పంచాయతీలుగా మారడంతో మా లాంటి వారికి ప్రజా ప్రతినిధులుగా ఎన్నో అవకాశాలు దక్కాయి. ఎంతో మంది రాజకీయాల్లో రాణిస్తూ పాలన కొనసాగిస్తున్నారు. కొత్త పంచాయతీగా ఏర్పాటైన మా గ్రామంలో నూతన పంచాయతీ భవనాన్ని సైతం నిర్మించుకున్నాం.

– పిన్ని సరిత, సర్పంచ్, జీ.కే.బంజర

ముందస్తు వరి సాగు మేలు



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

తిరుమలాయపాలెం: వానాకాలంలో ముందస్తుగా వరి సాగు చేసుకోవడం మేలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని సుబ్లేడులో వరిసాగు, వర్షాధార భూముల వివరాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మే 25 నుంచి జూన్ 3లోపు మధ్యకాలిక రకాలు, జూన్ 16 లోపు స్వల్పకాలిక రకాలు, జూన్ 25 లోపు నారుమళ్లలో విత్తుకోవాలని తెలిపారు. తద్వారా రానున్న అకాల వర్షాలు, వడగండ్ల వానల నుంచి వరిని కాపాడుకోవచ్చన్నారు. యాసంగి వరిసాగులో స్వల్ప కాలిక రకాలను ఎంచుకుని నవంబర్ 15 నుండే నారుమళ్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నారెడ్డి సీతారాంరెడ్డి, గ్రామ సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య, రైతు సమితి కోఆర్డినేటర్ భూక్యా నాగేశ్వరరావు, ఏఈఓ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు అందిస్తాం..

ఖమ్మంరూరల్: ఖరీఫ్‌లో సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు సకాలంలో అందిస్తామని ఏదులాపురం సొసైటీ చైర్మన్ జర్పుల లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం నాయుడుపేటలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు పాటించి ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. సంఘం ద్వారా వ్యవసాయ రుణాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్పర్సన్ ఊరడి హైమావతి, డైరెక్టర్లు ఎం.శ్రీకాంత్, ఎం.శ్రీనివాస్, పి.చందర్‌రావు, టి.శ్రీనివాస్‌రావు, సీఈఓ ఎండీ.మహ్మద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆర్థిక బలోపేతానికి కృషి

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు చెందిన కుల, చేతి వృత్తుల వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. శనివారం రజక సంఘం ఆధ్వర్యాన ఖమ్మంలోని వీడీఓస్ కాలనీలో గల మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి ఈ పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీ మున్సిపాలిటీలో రూ.2 కోట్లతో మోడర్న్ దోభిఘాట్లు, కమ్యూనిటీ హాల్ నిర్మించేందుకు స్థలం కేటాయించామని తెలిపారు. నాయీబ్రాహ్మణులు, రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌కు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘ నాయకులు జక్కుల లక్ష్మయ్య, రెగ్గళ్ల కొండల్, కణతాల నరసింహారావు, జక్కుల వెంకటరమణ, గడ్డం ఉపేందర్, కొలిపాక వెంకట్, గోలి రామారావు, తెనాలి వీరబాబు, పంతంగి రవికుమార్, తంగేళ్ళపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి

అదేవిధంగా కుల, చేతి వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారి అభివృద్ధికి రూ.లక్ష ఇవ్వాలని తలచి నేటి నుంచి అమలు చేసిన సందర్భంగా శుక్రవారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో కుమ్మర సంఘం ఆధ్వర్యాన సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, కుమ్మర సంఘం రాష్ట్ర కార్యదర్శి దరిపల్లి శ్రీనివాస్‌తో పాటు తొర్లికొండ నర్సింహారావు, షేక్.షకీన, ఇజ్జగిరి బాబు, పగడాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు అనుగుణంగా బ్యాంక్ పథకాలు



నారీ శక్తి పథకంలో ఓ మహిళకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: ఖాతాదారుల ఆకాంక్షలకు అనుగుణంగా రుణ, డిపాజిట్ పథకాలను అమలు చేస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జీఎం రవీంద్రబాబు తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన బ్యాంకు ఖాతాదారుల ప్రాజెక్టు పవర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థను మరింత విస్తరింపజేసేందుకు కృషి చేస్తున్నామన్నారు.గృహ, బంగారు, పారిశ్రామిక, ముద్ర, వ్యవసాయ రుణాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఖమ్మం రీజియన్ హెడ్ అండ్ డీజీఎం హనుమంత రెడ్డి, డిప్యూటీ రీజనల్ హెడ్ ప్రకాష్‌బాబు, ఏజీఎం జీవీరావు, మేనేజర్లు, వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉదాసీనతోనే పేపర్ల లీకేజీ..



మాట్లాడుతున్న ఆవుల అశోక్

ఖమ్మంమయూరిసెంటర్: టీఎస్‌పీఎస్‌సీ పరీక్షా పేపర్ల లీకేజీకి రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్ అన్నారు. శుక్రవారం నగరంలోని సిటీ లైబ్రరీలో జిల్లా కమిటీల ఆధ్వర్యాన నిర్వహించిన నిరుద్యోగ దీక్ష దివస్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో లీకేజీ ప్యాకేజీ పేరుతో నిరుద్యోగులను కుట్ర చేస్తుందని అన్నారు. నిరుద్యోగులపై కేసీఆర్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, రాకేష్, నాయకులు ప్రేమ్ సింగ్, సతీష్, చందు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్ ఎదుట ప్రజాపంథా ధర్నా



ధర్నాలో పాల్గొన్న ప్రజాపంథా నాయకులు

రఘునాథపాలెం: తెలంగాణ ప్రజా ఆకాంక్షల ప్రజాదివస్‌లో భాగంగా రఘునాథపాలెం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రఘునాథపాలెం మండల కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు ఆవుల మంగతాయి, మండల కార్యదర్శి కేశోతు లక్ష్మణ్‌లు మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రజలు, రైతులు, యువకులు, కూలీలు అందరూ చాలా ఇబ్బందుడు పడుతుంటే పట్టించుకోకుండా దశాబ్ది ఉత్సవాలు పేరుతో ప్రజాధనాన్ని వృథా చేయడం సరైంది కాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్ సిబ్బందికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేశోతు పాపారావు, ధరావత్ లక్ష్మణ్, కూరాకుల నరసయ్య, కొప్పాల చిన రామారావు, పొట్లపల్లి కృష్ణ, బానోత్ రాము, ఎర్రసంగి వెంకట్రామయ్య, ధరావత్ రవి, శ్రీను పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేత

కూసుమంచి: మండలంలోని జక్కేపల్లి గ్రామంలో టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యాన దివ్యాంగులకు అందిస్తున్న బస్‌పాస్‌లను శుక్రవారం గ్రామ సర్పంచ్ రాయభారపు స్వాతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దివ్యాంగుల ఇబ్బందుల దృష్ట్యా బస్‌పాస్‌లు అందజేయడం అభినందనీయమని, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కందుల వెంకటనారాయణ, ఉప సర్పంచ్ తంగెళ్ల ఉమ, వార్డు సభ్యులు కవిత, స్వప్న, వెంకటేశ్వర్లు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు సెలవులు పెంచాలి

ఖమ్మంమయూరిసెంటర్: మండుతున్న ఎండల దృష్ట్యా పాఠశాలల పునఃప్రారంభం గడువును ప్రభుత్వం పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున బయటకు వచ్చే పరిస్థితి లేదని, కాదుకూడదని పాఠశాలలను తెరిస్తే విద్యార్థులకు జరిగే అనర్థాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం సెలవులు పొడిగించకుంటే సంఘం ఆధ్వర్యాన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మడుపల్లి లక్ష్మణ్, ఎస్‌కే. సుభాని, యువరాజ్, సతీష్, వెంకటేశ్, సాయి, చందు, గోపి, ఉమా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం ముస్తఫానగర్‌లోని మసీదు–ఎ–ముస్తఫాకు నూతన కమిటీ సభ్యులను తెలంగాణ స్టేట్ సీఈఓ సయ్యద్ ఖాజా మోహినుద్దిన్ శుక్రవారం వెల్లడిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యక్షుడిగా షేక్ హుస్సైన్, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అజీముద్దిన్, కార్యదర్శిగా షేక్‌అబ్దుల్ రాషీద్, కోశాధికారిగా షేక్‌యాఖుబ్, సభ్యులుగా ఎండీ.యాఖుబ్‌జాని, ఎండీ.మసూద్‌అలీ, సయ్యద్ సర్వర్, సయ్యద్ మెహరాజ్, షేక్‌మునాఫ్, సయ్యద్ ఇక్బాల్, సయ్యద్ మహమూద్‌లు నియమితులైనట్లు, వీరు మూడేళ్లపాటు కొనసాగుతుందని పేర్కొన్నారు.

కొత్తకొత్తూరులో అంగన్‌వాడీ బడిబాట

నేలకొండపల్లి: మండలంలోని కొత్తకొత్తూరు గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వల్లాల రాధాకృష్ణ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దానిలో భాగంగానే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తుందని చెప్పారు. రెండేళ్ల చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకటరమణ, అంగన్‌వాడీ టీచర్ స్వాతి, ఆశా కార్యకర్త అరుణ, తల్లిదండ్రులు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే సంక్షేమ ఫలాలు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: కేసీఆర్ హయాంలోనే లబ్ధిదారులందరికీ సంక్షేమ ఫలాలు అందాయని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లెగూడెంలో ఓ ఫంక్షన్ హాల్‌లో పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా అర్హులైన వారికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా వస్తున్న నిధులతో నియోజకవర్గం అభివృద్ధితో పాటు తాను స్వయంగా పలు కార్యక్రమాలు, పేదలకు ఆర్థిక సాయమందిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయడానికి సంసిద్ధులు కావాలని చెప్పారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. సాగునీటి కష్టాలను తీర్చడంతో పాటు పేద కుటుంబాలు ఆడబిడ్డల పెళ్లికి రూ.లక్ష సాయం అందిస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, తహసీల్దార్లు టీ.సుమ, ఆర్‌కె.మీనన్, పుల్లయ్య, దారా ప్రసాద్, ఎంపీపీలు బెల్లం ఉమ, బీ.శ్రీనివాస్‌నాయక్, బీ.మంగీలాల్, జెడ్పీటీసీ ఏ.వరప్రసాద్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బెల్లం వేణు, సర్పంచ్‌లు కొండబాల వెంకటేశ్వర్లు, బరత్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

వైభవంగా బొడ్రాయి, గ్రామ దేవత విగ్రహాల ప్రతిష్ఠ



జలబిందెలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో బొడ్రాయి, గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠలో భాగంగా.. శుక్రవారం ఉత్సవ విగ్రహాల ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు జల బిందెలతో ఉత్సవ విగ్రహాలపై జలాభిషేకం చేస్తూ.. తన్మయత్వంతో తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. సొసైటీ చైర్మన్ ధనియాకుల హన్మంతరావు, సర్పంచ్ దుర్గాజ్యోతి, ఉప సర్పంచ్ కే.శ్రీనివాస్, చల్లా హరి, గంగరాజు, నాగేంద్రబాబు, మాధవరావు పాల్గొన్నారు.

గురుపౌర్ణమి వేడుకల పత్రిక ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో నిర్వహించే గురుపౌర్ణమి వేడుకలపై రూపొందించిన ఆహ్వాన పత్రికను మందిర కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 23 నుంచి జూలై 3వ తేదీ వరకు సాయిబాబా మందిరంలో 13వ గురుపౌర్ణమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మందిర కమిటీ ప్రతినిధులు పొట్టి వెంకటదుర్గాప్రసాద్, అర్వపల్లి నిరంజన్, కురువెళల జగన్మోహన్‌రావు, కాకరపర్తి సూర్యనారాయణ, వములపల్లి నరేష్, గన్నవరపు నాగేశ్వరరావు, శీలం హనుమంతరావు, రూప తదితరులు పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణ పోస్టర్లు..

ఖమ్మంఅర్బన్: ఖమ్మం నగరంలోని లకారం ట్యాంక్ బండ్‌పై ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యాన ఈనెల 17న ఠానునాయక్ విగ్రహావిష్కరణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం విగ్రహావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను సంఘం కార్యాలయంలో ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర, జిల్లా నాయకుడు బానోత్ సోమ్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ బస్కీ, ధరావత్ రామ్మూర్తి, బానోత్ కిషన్, బానోత్ రామ్మూర్తితో పాటు తారాదేవి, అరుణ, భీముడు, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు

కామేపల్లి(కారేపల్లి): ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. కామేపల్లి మండలం జాస్తిపల్లికి చెందిన చల్లా కిరణ్‌కుమార్ ద్విచక్రవాహనంపై ఖమ్మం వెళ్తుండగా.. ఖమ్మం నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి పండితాపురం ఫంక్షన్ హాల్ సమీపాన ఢీకొట్టింది. ఈ ఘటనలో కిరణ్‌కు తీవ్రగాయాలు కావడంతో 108లో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక సాయం

ఖమ్మం స్పోర్ట్స్: వీల్ చైర్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ దివ్యాంగ క్రికెటర్ షేక్.సమ్మద్దీన్‌కు డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్ రూ.10వేల నగదును వితరణగా అందజేశారు. ఈనెల రేపటి నుంచి 17వ తేదీ వరకు న్యూఢిల్లీలో జరిగే నాలుగో సీజన్ లీగ్‌లో ఖమ్మం నుంచి హైదరాబాద్ హరికేన్ జట్టు తరఫున ఆడనున్నాడు. ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా తనవంతు సాయంగా ఈ వితరణ చేసినట్లు ప్రదీప్‌కుమార్ తెలిపారు.కార్యక్రమంలో ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, దిలీప్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాల పేరిట కాలయాపన



మాట్లాడుతున్న జావీద్ తదితరులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులకు అందించే ఆర్థిక సాయం గడువు పొడిగించాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో యావత్ అధికార యంత్రాంగం ప్రజాసమస్యలను వదిలేసి కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులు ఎవరు అందుబాటులో లేరన్నారు. దరఖాస్తు గడువు పెంచి బీసీలకు న్యాయం చేసేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, పల్లెబోయిన భారతిచంద్రం, సైదులు, లక్ష్మణ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.